కేజీబీవీల్లో ఖాళీలకు నోటిఫికేషన్ విడుదల

కలెక్టరేట్, సెప్టెంబరు 26: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష ఏపీసీ ప్రేమకుమార్ తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిపై బోధనా సిబ్బంది పోస్టులను, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై బోధనేతర సిబ్బందిని నియమించడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పీజీటీ 15 పోస్టులు, సీఆర్టీ 8, పార్ట్ టైం టీచర్లు 15, వార్డెన్లు 4, అకౌంటెంట్‌లు 6 మొత్తం 48 పోస్టులకు వచ్చే నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.



చూడాల్సిందే

● ఆకట్టుకునే పర్యాటక ప్రాంతాలు జిల్లా సొంతం
● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

బొబ్బిలి పౌరుషానికి, నాటి యుద్ధ వీరత్వానికి సూచికగా నిలిచిన బొబ్బిలి కోట ఇది. బొబ్బిలి వచ్చే ప్రతి సందర్శకుడు కోటను చూసి వెళ్తారు. ఇక్కడ అనేక సినిమాలను కూడా చిత్రీకరించారు. కోటలో బొబ్బిలి యుద్ధానికి సంబంధించిన ఆయుధాలు, రాజుల బంగారు, వెండి సింహాసనాలు, వారు ఉపయోగించిన కార్లు తదితర వాటితో మ్యూజియం కూడా ఉంది. అవన్నీ సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. చరిత్రకు తార్కాణంగా నిలిచిన చిహ్నాలే కాదు ఆధ్యాత్మిక, ఆహ్లాద ప్రదేశాలూ జిల్లాలో అనేకం ఉన్నాయి. చుట్టూ కొండలు మధ్యలో నీటితో మనసును హత్తుకునే తాటిపూడి జలాశయం అందాలు ప్రత్యేకం. ఎస్.కోట మండలంలోని పుణ్యగిరి, నెల్లిమర్ల మండలంలోని రామతీర్థం, విజయనగరం సమీపంలోని రామనారాయణం ఆధ్యాత్మిక టూరిస్టు కేంద్రాలుగా వర్ధిల్లుతున్నాయి. పూసపాటిరేగ మండలం చింతపల్లి బీచ్ కూడా పర్యాటక ప్రదేశంగా పేరొందింది. విజయనగరంలోని గురజాడ స్వగృహం, పెద్ద చెరువు, పైడితల్లి ఆలయాలు, గంటస్తంభం, మూడు లాంతర్లు తదితర ప్రాంతాలనూ చూడాల్సిందే.

7 లో

- విజయనగరం



అమెరికన్లతో చర్చిస్తున్న మంత్రి శ్రీనివాస్

న్యూయార్క్‌లో మంత్రి

ప్రముఖులతో శ్రీనివాస్ భేటీ

విజయనగరం(ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 26: అమెరికాలోని న్యూయార్క్‌లో వివిధ రంగాల ప్రముఖులతో గురువారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమావేశమయ్యారు. వరదలు, కరువునివారణ చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని ప్రపంచ బ్యాంకు సహజ వనరుల పరిరక్షణ ప్రాజెక్టు ప్రతినిధి మైక్ వెబ్‌స్టార్ మంత్రికి వివరించారు. చిత్తూరు జిల్లాలో తాము చేపట్టిన కార్యక్రమాలకు చంద్రబాబు ప్రోత్సాహం, సహకారాన్ని గుర్తు చేశారు. షెల్ ఫౌండేషన్ సీఈవో జోనాథర్ బెర్మాన్, పోర్టుపోలియో అధిపతి మీరాషాతోనూ మంత్రి సమావేశమయ్యారు. సన్న, చిన్నకారు రైతులు, గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమాల గురించి చర్చించారు. వ్యవసాయ రంగంలో సౌర శక్తి వినియోగం పెంచడంపైనా మాట్లాడారు.

దేశసేవకు ముందుండాలి

● మాతృ భూమిని, మాతృభాషను మరువొద్దు: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



కల్నల్ సంతోష్‌బాబు మెమోరియల్ భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ విజయనగరం టౌన్, సెప్టెంబర్ 26: ప్రతీ విద్యార్థి దేశ సేవకు ముందుండాలని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. విజయనగరం జిల్లా కోరుకొండలో రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైనిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రితో పాఠశాలలోని అన్ని విభాగాలను సందర్శించారు. అలాగే కల్నల్ సంతోష్‌బాబు మెమోరియల్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆడిటోరియంలో విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠశాల గొప్పతనంపై మాట్లాడారు. కోరుకొండ సైనిక పాఠశాల పచ్చటి పరిసరాల మధ్య, ఆహ్లాదకర వాతావరణంలో నడుస్తోందని, విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా బోధన అందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులంతా ఏ దేశమేగినా మాతృ భూమిని, మాతృభాషను మరువొద్దని సూచించారు. ప్రాథమిక విద్య మాతృభాషలో సాగాలన్నారు. ప్రతీ ఒక్కరూ దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. యువత క్రమశిక్షణతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని చెప్పారు. భవిష్యత్తులో భారత సైన్యంలో చేరి సేవలందించాలనుకునే విద్యార్థులకు పాఠశాలలో అందిస్తున్న శిక్షణ అత్యుత్తమమైనదని అన్నారు.

● జిల్లా పర్యటనలో భాగంగా గురువారం కోరుకొండ సైనిక పాఠశాలకు చేరుకున్న భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్, సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి ఘన స్వాగతం పలికారు.

వాల్మీకి రామాయణ పరిశోధన కేంద్రం ప్రారంభం

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 26: రామనారాయణంలో వాల్మీకి రామాయణ పరిశోధన కేంద్రాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాల్మీకి రామాయణంలో వివిధ అంశాలను స్పృశించడం కోసం రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. భారతదేశం హిందూ దేశమని, హిందువు అనేది ఒక మతం కాదని, అది ఒక జీవన విధానమని అన్నారు. ఆంగ్లేయుల వల్ల మన సాంస్కృతిని కోల్పోయామని, మళ్లీ అలాంటి సాంస్కృతిని కాపాడేందుకు ఈ పరిశోధన కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రామాయణంలోని మానవీయ విలువలన్నీ భావితరాలకు అందించేందుకు నిర్ణయం తీసుకున్న నారాయణం కుటుంబ సభ్యులను అభినందించారు. మానవత్వంలో దైవత్వం ఉన్నదని నిరూపించింది ఒక్క రామాయణం మాత్రమేనన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకి రామాయణ పరిశోధన కేంద్రం ప్రారంభ సభలో మాజీ ఉప రాష్ట్రపతి



సందడి చేసిన పాయల్ రాజ్‌పుత్

హీరోయిన్ పాయల్‌రాజ్‌పుత్ (ఆర్ఎక్స్ 100 ఫేమ్) నగరంలో గురువారం సందడి చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న ఫోర్‌సిటీ సెంట్రల్ మాల్లో ఎల్‌జీటీ సినీమాస్‌ను ఆమె ప్రారంభించారు. హీరోయిన్‌ను చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున ఫోర్టుసిటీ ప్రాంగణానికి చేరుకున్నారు. వారందరికీ ఆమె అభివాదం చేశారు.

- విజయనగరం రింగురోడ్డు

సిరిమాను చెట్టు రేపు నగరానికి రాక



విజయనగరం రూరల్, సెప్టెంబరు 26: ఉత్తరాంధ్ర ప్రజల అరాధ్యదైవం, నడిచే దేవతగా పేరొందిన పైడిమాంబ సిరిమాను చెట్టు శనివారం నగరంలోకి రానుంది. ఈ ఏడాది చింతమాను చెట్టును డెంకాడ మండలం పెదతాడి వాడలో మజ్జి వారి కళ్లాల్లో గుర్తించిన విషయం తెలిసిందే. అక్కడ ఇప్పటికే పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆ చెట్టును విజయనగరం తీసుకువచ్చే ప్రక్రియ శనివారం చేపట్టను న్నారు. ఈ మేరకు అలయ ఈవో డీవీవీ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం పోలీసు, రెవెన్యూ, అర్అండ్‌బీ, నగరపాలక సంస్థ, విద్యుత్, అగ్నిమాపకశాఖ, దేవదాయ శాఖలకు ఇప్పటికే పైడిమాంబ దేవస్థానం సమాచారం ఇచ్చింది. ఈమేరకు వారంతా శనివారం ఉదయం డెంకాడ మండలంలోని పెదతాడివాడకు చేరుకోనున్నారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు పూజల అనంతరం చెట్టును కొట్టే తంతు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్న సమారాధన జరగనుంది. సిరిమాను చెట్టు మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పెదతాడివాడ నుంచి బయలుదేరనుంది.

రూట్‌మ్యాప్ ఇలా..

సిరిమాను చెట్టు పెదతాటివాడ జంక్షన్ నుంచి జమ్ము జంక్షన్ వద్ద నగరంలోకి వస్తుంది. అక్కడ భక్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలకడంతో పాటు ప్రత్యేక పూజ చేస్తారు. అనంతరం నగరంలోని విద్యుత్ భవన్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి ఎఫ్‌సీఐ గోదాం, ధర్మపురి ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్, అంబేద్కర్ కూడలి, మయూరి కూడలి, రైల్వేస్టేషన్ రోడ్డు, పైడి మాంబ వనంగుడి, సీఎంఆర్ జంక్షన్, ఎస్‌సీఎస్ రోడ్డు, కన్యకాపరమేశ్వరీ ఆలయం, గంటస్తంభం, మూడులాంతర్లు, పాత సోనియా సెంటర్, శివాలయం వీధి, పైడిమాంబ కల్యాణమండపం, పార్కుగేటు, సుద్దవీధి జంక్షన్ మీదుగా అలయ అర్చకుడు బంటుపల్లి వెంకటరావు నివాసం ఉంటున్న హుకుంపేటకు చేరుతుంది. అక్కడ ఈ చింతమాను చెట్టును సిరిమానుగా మలిచే ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం అవుతుంది. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం వారసత్వంగా వస్తున్న కార్పెంటర్‌లు సిరిమానుగా మలిచే పని ప్రారంభిస్తారు.

తనిఖీల్లో నిజాయితీ ఉందా?

● ఫిర్యాదులొచ్చిన దుకాణాలపైనే అధికారుల గురి ● సమాచారం బయటకు పొక్కి తప్పించుకుంటున్న మిగతా వ్యాపారులు
● విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్‌సేఫ్టీ, తూనికలు కొలతల అధికారుల తీరిది

శృంగవరపుకోట, సెప్టెంబరు 26:

● శృంగవరపుకోటలో ఆ మధ్య వంట నూనెల హోల్‌సేల్ దుకాణాల్లో తనిఖీలు జరుగుతున్నట్లు తెలుసుకున్న ఓ వ్యక్తి పట్టణంలో పేరున్న ఓ స్వీట్ దుకాణ యజమాని లైసెన్స్ లేకుండా భారీ స్థాయిలో మరో చోట స్వీట్స్ వ్యాపారం చేస్తున్నట్లు విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ, తూనికలు, కొలతల అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ యజమాని ఎక్కడెక్కడి నుంచో ఫోన్‌లు చేయించారు. స్థానికంగా ఉన్న ఓ పోలీస్ అధికారి కూడా ఆ స్వీట్ దుకాణం వద్దకు వెళ్లొద్దని ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల ఆదేశాలు లేవని తనిఖీ అధికారులు మొహం చాటేశారు.

● శృంగవరపుకోటలోనే అదే రోజు ఫుడ్‌సేఫ్టీ అధికారి లైసెన్స్ లేకుండా నడుపుతున్న మరో స్వీట్ దుకాణం తనిఖీ చేశారు. గతంలో ఈ దుకాణంపై కేసు నమోదైంది. రూ.లక్షలు జరిమానా వేశారు. చెల్లించకపోవడంతో జేసీ కోర్టులో ఈకేసు కొనసాగుతోంది. ఇదే కారణం చూపి నమూనా (సాంపిల్) సేకరించడం కుదరదని తప్పించుకున్నారు.

దుకాణాల తనిఖీల్లో అధికారుల తీరుకు ఈరెండు ఉదాహరణలు. ఏవో ఒకట్రెండు దుకాణాలను ఎంపిక చేసుకొని తనిఖీలు నిర్వహించడం ద్వారా మిగిలిన దుకాణదారులను దారికి తెచ్చుకొనేందుకు అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా జయలక్ష్మి, ఎంఎస్ లక్ష్మీనారాయణ ట్రేడర్స్‌లో తనిఖీలు చేశారు. ఇప్పటిలాగే వాటిల్లో తనిఖీలు చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న మిగిలిన వ్యాపారులు దుకాణాలు మూసేసారు. ఎందుకంటే తనిఖీ చేస్తే పట్టుబడతామని వ్యాపారాలు చేసేవారందరికీ తెలుసు. విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ, తూనికలు, కొలతల అధికారులు జిల్లాలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఇదే పరిస్థితి. వంట నూనెల్లోనే కాదు జిల్లాలో నిత్యావసర సరుకులు, హోటళ్లు, స్వీట్స్ మాంసం, చేపలు తదితర ఏ దుకాణంలోనైనా వినియోగదారులను మోసం చేసే వ్యాపారులే అధికం. కాలం చెల్లిన వంట నూనెలను విక్రయించడం, తూకంలో తేడా రావడం తరచూ చూస్తున్నాం. రహదారుల పక్కనున్న భోజనం బళ్ల నుంచి పెద్ద పెద్ద స్టార్ హోటల్స్ వరకు పాచిపోయిన వంటకాలను వేడిచేసి పెడుతున్నారు. బిల్లులు ఇవ్వకుండా జీఎస్టీని ఎగ్గొడుతున్నారు. నాసిరకం స్వీట్స్ అమ్ముతున్నారు. వాటిపై ఎప్పుడు తయారు చేశారు? ఎంతవరకు నిల్వవుంటుందన్న వివరాలు కనిపించవు.

ఇక మాంసం, చేపల దుకాణాల్లో తాజా సరుకు దొరకడమే కష్టం. అదెప్పటిదో తెలుసుకోవడం కష్టం. చేపలు ఐస్‌లో ఉంటాయి. కేజీ చేపలు ఇంటికెళ్లి చూస్తే కనీసం పది గ్రాములైనా తక్కువవుంటుంది. ఇంత జరుగుతున్నా అధికారులు తనిఖీలు చేయరు. ఎప్పుడో ఎవరో ఇచ్చిన ఫిర్యాదుతో తనిఖీలకు వెళ్లి ఒక ట్రెండు దుకాణాల్లో తనిఖీలు చేస్తుంటారు. ఆ సమయంలో మిగిలిన దుకాణాలన్నీ మూతపడటం తప్ప ఇక నుంచైనా ధర్మబద్ధంగా వ్యాపారం చేయాలన్న ఆలోచన వ్యాపారుల్లో రావడం లేదు. రాజకీయ ఒత్తిళ్లతో పని చేసే అధికారులు ఎవరికైతే ప్రజాప్రతినిధుల అండ ఉండదో వారి దుకాణాల వైపే చూస్తారు.



ఎస్.కోటలో దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)



జనసేన గూటికి అవనాపు దంపతులు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 26: డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ అవనాపు భావన, భర్త విక్రమ్ గురువారం జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో మంగళగిరిలో జనసేన పార్టీలో చేరారు. ఇద్దరికీ పవన్‌కల్యాణ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. విక్రమ్ ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరుతున్నట్టు మీడియా సమావేశంలో ప్రకటించారు. ఆ మేరకు గురువారం పార్టీ అధినేత సమక్షంలో చేరారు.

రోడ్డు మారబోతోంది..


● రాజాం-దోలపేట రహదారి పనులకు నేడు శంకుస్థాపన
● వైసీపీ తప్పిదాలను తూర్పారబట్టిన 'ఆంధ్రజ్యోతి'



రాజాం రూరల్, సెప్టెంబరు 26: రాజాం-డోలపేట రహదారి విస్తరణ పనులకు ఈనెల 27న మాజీ మంత్రి, రాజాం శాసనసభ్యులు కోండ్రు మురళీ మోహన్ శంకుస్థాపన చేయనున్నారు. ఈనెల 20న రూ.6 కోట్లు అందినా.. రోడ్డు లేదాయే.. శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు కదిలారు. రోడ్డు పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ఈ రోడ్డుపై రెండున్నరేళ్లలో వైసీపీ నాయకుల అసత్య ప్రకటనలు.. తప్పిదాలు.. ప్రజల వెతలు.. ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రుల రోదనలు.. వాహనచోదకుల ఇక్కట్లు.. ఉపాధి కోల్పోయిన వ్యాపారుల వ్యధలపై 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు కథనాలను ప్రచురించింది. కాగా పట్టణంలో రెండు మార్గాల్లో రెండోవిడత విస్తరణ పనులకు ప్రస్తుత ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యన్నారాయణ గతేడాది జనవరి 19న శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్‌తో పనులు చేయించారు. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన రూ.6 కోట్లుకు మంగళం పాడారు. దీంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ రాజాం-డోలపేట రహదారి సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పెట్టారు. స్పందించిన చంద్రబాబు పాత కాంట్రాక్టర్‌కు బకాయిపడిన రూ.6 కోట్లు నిధులు విడుదల చేశారు. ఈనెల ప్రారంభం నుంచి దఫదఫాలుగా కురుస్తున్న వర్షాలతో కాంట్రాక్టర్ పనులు పునఃప్రారంభించేందుకు వీలుకాని పరిస్థితి ఉంది. ఎట్టకేలకు ఈనెల 27న కోండ్రు మురళీమోహన్ విస్తరణ పనులకు జీఎంఆర్ఐటీ సమీపంలో శంకుస్థాపన చేయనున్నారు.

ఆ సన్నివేశాలు తొలగిస్తే ఓకే

• హైకోర్టుకు తెలిపిన సెన్సార్ బోర్డు



తాము సూచించిన సన్నివేశాలకు కత్తెర వేస్తే 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ బోర్డు బాంబే హైకోర్టుకు తెలిపింది. కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో పలుమార్లు విడుదల వాయిదా పడింది. దీంతో ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించగా, సర్టిఫికెట్ జారీ చేసే విషయంలో ఈ నెల 25లోగా ఓ నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు గురువారం విచారణకు రాగా, కొన్ని సన్నివేశాల్లో కట్స్‌ను సూచించిన సెన్సార్‌బోర్డ్ అందుకు అంగీకరిస్తే సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని కోర్టుకు నివేదించింది. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి చిత్రబృందం సమయం కోరింది. దీంతో కోర్టు తదుపరి విచారణను ఈ నెల 30కు వాయిదా వేసింది. ఆ లోగా ఓ నిర్ణయానికి రావాలని నిర్మాణసంస్థను ఆదేశించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం, ఎమర్జెన్సీ నాటి సంఘటనల నేపథ్యంలో 'ఎమర్జెన్సీ' తెరకెక్కింది. కంగన ఇందిరాగాంధీ పాత్రను పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

జస్ట్ ఆస్కింగ్.. అంటూ ట్వీట్ల మీద ట్వీట్లు



విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. వివిధ అంశాలపై స్పందిస్తూ 'జస్ట్ ఆస్కింగ్' అంటూ ప్రశ్నలు సంధిస్తుంటారు. తిరుమల లడ్డు వివాదంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ప్రకాశ్‌రాజ్‌కు మధ్య మూడు రోజుల క్రితం మొదలైన ట్వీట్ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రకాశ్‌రాజ్ పోస్టులపై పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేయడమే కాకుండా సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని మీడియా సమావేశంలో హెచ్చరించడంతో ఈ ట్వీట్ల అటాక్ మొదలైంది. 'నేను విదేశాల్లో ఉన్నా.. ఇండియా వచ్చిన తర్వాత మీ ప్రశ్నలకు సమాధానం చెబుతా' అని ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు. అంతటితో ఈ వ్యవహారం ముగిసిందని అందరూ భావించారు. కానీ ప్రకాశ్‌రాజ్ ఊరుకోలేదు. తమిళ హీరో కార్తీ లడ్డు వ్యవహారంపై క్షమాపణ చెప్పడాన్ని ప్రస్తావిస్తూ 'చేయని తప్పునకు క్షమాపణలు చెప్పించుకోవడంలో ఆనందం ఏమిటో.. జస్ట్ ఆస్కింగ్' అంటూనే వ్యంగ్య బాణం వదిలారు. అయితే ఈ ట్వీట్‌పై పవన్‌కల్యాణ్ స్పందించలేదు. ఆయన మౌనంగా ఉన్నా ఊరుకోకుండా గురువారం మరో ట్వీట్ బాణం వదిలారు ప్రకాశ్‌రాజ్. 'గెలిచే ముందు ఒక అవతారం.. గెలిచాక మరో అవతారం .. ఏమిటీ అవాంతరం.. ఎందుకీ అయోమయం.. ఏది నిజం.. జస్ట్ ఆస్కింగ్' అంటూ తనదైన శైలిలో ప్రశ్నించారు. ప్రకాశ్‌రాజ్ పెట్టిన ఈ ట్వీట్ పై నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు.



ఉత్సవంలా సాగే పాట

శంకర్

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. కియారా అద్వాణీ కథానాయిక. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి రెండో గీతాన్ని ఈ నెల 30న విడుదల చేయనున్నారు. గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్, సంగీత దర్శకుడు తమన్ ఈ పాట చిత్రీకరణకు సంబంధించిన విశేషాలను పంచుకున్నారు. శంకర్ మాట్లాడుతూ 'ఈ పాట చిత్రీకరణ కోసం చాలా పరిశోధన చేశాం. దేశంలోని భిన్న ప్రాంతాలకు చెందిన నృత్యరీతులను పాటలో భాగం చేశాం. ఒక ఉత్సవంలా ఈ పాట సాగుతుంది. రామ్‌చరణ్ అద్భుతంగా నర్తించారు' అని చెప్పారు. తమన్ మాట్లాడుతూ "రా మచ్చా... పాటలో విభిన్న సంస్కృతులను చూపించబోతున్నాం. పాటను తెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.



టాలీవుడ్ అగ్ర దర్శకులు రాజమౌళి, సుకుమార్ అనూహ్య కలయిక అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్టూడియోలో 'పుష్ప2' చిత్రీకరణ జరుగుతోంది. మహేశ్‌బాబుతో తాను చేయబోయే సినిమా పనుల కోసం రాజమౌళి కూడా అదే స్టూడియోకు వెళ్లారు. అక్కడ వారిద్దరు కలుసుకున్నారు.

ఆకట్టుకునే అలియా పోరాటం



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'జిగ్రా'. వాసన్ బాలా దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించారు. అలియాభట్ సోదరుడి పాత్రలో వేదాంగ్ రైనా నటించాడు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. చిత్రబృందం గురువారం ట్రైలర్‌ను విడుదల చేసింది. హంతక ముఠాల నుంచి తమ్ముణ్ణి కాపాడుకునేందుకు అక్క చేసిన పోరాటం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. యాక్షన్ సన్నివేశాల్లో అలియా నటన ఆకట్టుకుంది.

మనసుకి హత్తుకొనే తల్లి కథ



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఆశీస్సులతో ఆయన తనయుడు కిశోర్ చిత్రనిర్మాణరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న 'తల్లి మనసు' చిత్ర షూటింగ్ పార్ట్ పూర్తయింది. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన తారాగణం. ఈ సినిమాతో వి.శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ముత్యాల కిశోర్ మాట్లాడుతూ 'సినిమా ప్రారంభోత్సవం నాడు సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని చెప్పినట్టే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా షూటింగ్ చేసి వర్క్ పూర్తి చేశాం. మంచి కథ, కథనాలు సినిమాకు ప్రధాన బలం. అందుకు తగ్గ ఆర్టిస్టులు దొరికారు. వారందరి సహకారంతో మనసు కట్టి పడేసే అద్భుత చిత్రంగా రూపుదిద్దుకుంది. నాన్నగారి పర్యవేక్షణలో దర్శకుడు చక్కగా సినిమా తీశారు. తొలి ప్రయత్నంలోనే ఒక మంచి సినిమా తీసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. వాస్తవిక జీవితానికి అద్దం పట్టే విధంగా 'తల్లి మనసు' ఉంటుందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని ముత్యాల సుబ్బయ్య చెప్పారు.



యాభై సెకన్ల యాడ్‌కు రూ. ఐదు కోట్లా!?

కాలం కలసి రావాలే కానీ సినిమా తారలకు ఇప్పుడు రెండు చేతులా సంపాదనే!. అయితే సినిమా షూటింగ్ లేకపోతే యాడ్ షూటింగ్ అన్నట్లుగా ఉంది కొంతమంది తారల బిజీ షెడ్యూల్. రెండు చోట్లా మంచి డబ్బు వస్తుండడంతో మరింత హుషారుగా పని చేస్తున్నారు. ఒక సినిమా కోసం మూడు, నాలుగు నెలలు కష్టపడితే వచ్చే పారితోషికం కంటే ఒక నిముషం పాటు కనిపించే యాడ్ ఫిల్మ్ సంపాదనే ఎక్కువగా ఉండడంతో తెలుగులోనూ చాలా మంది తారలు ఇప్పుడు యాడ్ ఫిల్మ్‌లో నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అందరి కంటే ఒక అడుగు ముందుకు వేసి యాభై సెకన్ల యాడ్ ఫిల్మ్‌లో నటించినందుకు అక్షరాలా రూ. ఐదు కోట్లు వసూలు చేసి వార్తల్లో నిలిచారు నయనతార. ఇంతకుముందు నయనతార పారితోషికం రూ. ఐదు కోట్లే ఉండేది. కానీ హిందీ చిత్రం 'జవాన్' సూపర్ హిట్ అయిన తర్వాత అమాంతం తన పారితోషికాన్ని పది కోట్ల రూపాయలకు నయనతార పెంచేసిందని నిర్మాతలు చెబుతున్నారు. అంటే సౌత్‌లో నే అత్యధిక పారితోషికం తీసుకొనే హీరోయిన్ నయనతారే అన్నమాట. ఇప్పుడు యాడ్ ఫిల్మ్‌తోనూ ఆమె మోత మోగిస్తోంది. ప్రస్తుతం నయనతార తన భర్త విఘ్నేశ్, కవల పిల్లలతో గ్రీస్‌లో జాలీగా విహరిస్తోంది.

అక్టోబర్‌లో గ్యాంగ్‌స్టర్



మాఫియా ముఠాల మధ్య ఆధిపత్య పోరును సరికొత్తగా వెండితెరపై ఆవిష్కరించిన పలు చిత్రాలు విజయం అందుకున్నాయి. ఇప్పుడు ఇదే తరహా కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. చంద్రశేఖర్ రాథోడ్, కాశ్వీ కాంచన్ జంటగా నటిస్తున్నారు. చంద్రశేఖర్ రాథోడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 25న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా రచయిత సాయిమాధవ్ బుర్రా చేతుల మీదుగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకలను ఆకట్టుకునేలా ఉంటుందనీ, కథలోని మలుపులు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని చంద్రశేఖర్ రాథోడ్ తెలిపారు.

అప్‌డేట్స్


మా మనవడినీ ఆదరించండి

– పరుచూరి బ్రదర్స్



సుదర్శన్ పరుచూరి హీరోగా పరిచమయవుతున్న 'మిస్టర్ సెలబ్రిటీ' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు నిర్మించారు. వరలక్ష్మి శరత్‌కుమార్, నాజర్, రఘుబాబు ఇతర ముఖ్య పాత్రధారులు. ఈ సినిమా రిలీజ్ పోస్టర్‌ను పరుచూరి గోపాలకృష్ణ విడుదల చేసి 'మమ్మల్ని ఆదరించినట్లుగానే మా మనవడు సుదర్శన్‌ను ఆదరించాలని కోరుతున్నా. కొత్త దర్శకుడైనా రవికిశోర్ సినిమా బాగా తీశాడు' అని అభినందించారు. పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'మమ్మల్ని నలభై ఏళ్లుగా ఆదరిస్తున్నారు. మా మనవడు సుదర్శన్ 'మిస్టర్ సెలబ్రిటీ' హీరోగా మీ ముందుకు వస్తున్నాడు. తనని ఆశీర్వదించి, సినిమాను హిట్ చేయండి' అని కోరారు.

మాస్ లుక్‌తో



యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్‌రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'పొట్టేల్'. దసరాకు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నటుడు అజయ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఆయన లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. మాస్ లుక్‌లో పవర్‌ఫుల్‌గా కనిపించారు అజయ్. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి కె, సురేశ్ కుమార్ సడిగె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతం: శేఖర్ చంద్ర, సినిమాటోగ్రఫీ: మోనిష్ భూపతి రాజు



ఆంధ్ర వర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి సెల్ఫ్ సపోర్టెడ్ కోర్సులు. ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ సహకారంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 40 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.55,000.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో క్రిటికల్ కేర్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 15 చొప్పున మొత్తం 45 సీట్లు ఉన్నాయి. గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్ ఎంచుకున్నవారికి ప్రోగ్రామ్ ఫీజు రూ.40,000. మిగిలిన స్పెషలైజేషన్‌లకు ప్రోగ్రామ్ ఫీజు రూ.60,000.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ/బీఎస్సీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వయసు:** దరఖాస్తు నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 16
- **క్యాంపస్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, కిమ్స్-ఐకాన్ హాస్పిటల్ క్యాంపస్, షీలానగర్, విశాఖపట్నం-532003
- **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం - 530003
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

దిక్సూచి

ఐఐఎఫ్‌టీలో
పీజీ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్(ఇంటర్నేషనల్ బిజినెస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి ఏడాది. ఇది వీకెండ్ ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రతి ట్రైమెస్టర్ ప్రారంభంలో మూడు రోజులు కాంటాక్ట్ వీక్ నిర్వహిస్తారు. రెండో ట్రైమెస్టర్‌లో పోర్ట్ విజిట్ ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాలవారికి 45 శాతం మార్కులు చాలు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనుకూలంగా ఉంటుంది.

- దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 5
- వెబ్‌సైట్: www.iift.ac.in




కొఠియా గ్రూప్‌లో గాలిగబడారు జలపాతం

ఆకుపచ్చని అందాలు..

జలపాతాల హొయలు!

పచ్చని ప్రకృతి సోయగాలు... ఆ నడుమ జలపాతాల హొయలు... చారిత్రక ప్రసిద్ధిగాంచిన ప్రదేశాలు... ఆధ్యాత్మిక క్షేత్రాలు... నిత్యం కళకళలాడే జలాశయాలు... ఇవీ ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకతలు. కాసింత శ్రద్ధ చూపితే... కొంచెం అభివృద్ధి చేసి చూపితే... పర్యాటకులు క్యూ కట్టే ప్రదేశాలు అనేకం ఈ జిల్లాల సొంతం. ముఖ్యంగా అటవీ ప్రాంతాల అందాలు చూపరుల మనసును దోచుకుంటాయనడంలో సందేహం లేదు. ఆ ప్రాంతాల విశిష్టతలు... విశేషాలు తెలుసుకుందాం.

- ఇదీ ఉమ్మడి జిల్లాల ప్రత్యేకత
- మన్యం సొగసులు చూడాల్సిందే
- పర్యాటక అభివృద్ధికి అడుగులు వేస్తేనే ప్రగతి

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

జలపాతాలు చూస్తారా?

సాలూరు రూరల్: సాలూరు ఏవోబీ ప్రకృతి అందాలకు పెట్టని కోట. పర్యాటకంగా సాలూరు ఏజెన్సీని అభివృద్ధి చేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. గిరిజనులకు ఉపాధి అవకాశాలు... పర్యాటకులకు ఆనందం సొంతమవుతాయి. ఏవోబీ కొండలు జలపాతాలకు పుట్టినిళ్లు. సాలూరు మండలం లొద్ద వద్ద హనుమబారిబంద జలపాతం... శిఖపరువు గోముఖి జలపాతం, దళాయివలసలో రాంధారి, దండిగాంలో శివ, కురుకూటి, కుంబిమడ జలపాతాలు ఉన్నాయి. కొఠియాకు సమీపంలో తూర్పు కనుమల్లో ఎత్తయిన ఒడిశా దేవ్‌మాలి పర్యాటక ప్రదేశం ఉంది. సాలూరు మండలం సారిక, నేరేళ్లవలస, కొఠియా మీదుగా ఈ ప్రాంతానికి పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కొఠియాకు సమీపంలో గాలిగబడారు జలపాతం ఉంది. దీనిని ఒడిశా పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయడం విశేషం. శిఖపరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు ఉన్నాయి. ఇవి కార్యరూపం దాల్చితే...ఈ ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా పర్యాటకానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఐక్యరాజ్యసమితి నిర్ణయం మేరకు 1980 నుంచి ఏటా సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థికపరమైన విలువలను ప్రపంచ దేశాల మధ్య పరస్పరం పంపిణీ చేసుకునేందుకు పర్యాటక దినోత్సవాన్ని వేదికగా చేసుకుంటున్నారు. ఏటా ఒక్కో నినాదం... లక్ష్యంతో ఒక్కో దేశం ఈ కార్యక్రమాన్ని తమ భుజస్కంధాలపై వేసుకుంటోంది. ఈ ఏడాది మన దేశం ఆధ్వర్యంలో పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించుకోవడం గమనార్హం.


పార్కు ప్రాంతంలో ఒరిగిన మొక్కలు

నేడు శ్రీకారం...

సీతంపేట ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. దీనిలో భాగంగా ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆడలి వ్యూ పాయింట్, ఎన్‌టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో 5డి థియేటర్‌ను ప్రారంభించేందుకు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేశారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకలు పర్యావరణ హితంగా ఉండాలని... గిరిజన సంస్కృతి... సంప్రదాయాలు ఉట్టిపడేలా స్వాగత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

కొత్తగా మరికొన్ని...

సీతంపేట ఏజెన్సీలో ఇంతకుముందు ఉన్న పర్యా టక ప్రాంతాలతో పాటు బెన్నరాయి జలపాతం, పొల్ల వ్యూ పాయింట్, సున్నపు గెడ్డ జలపాతం అభివృద్ధి చేసేందుకు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిద్ధమవుతోంది. జగతిపల్లి రిసార్ట్స్ పనులను రూ.6.6 కోట్లతో పునఃప్రారంభానికి టెండర్లు పిలవాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

అటవీ శాఖ నుంచి అడ్డంకులు..

బెన్నరాయి, సున్నపుగెడ్డ జలపాతాలు, పొల్ల వ్యూ పాయింట్‌లను తీర్చిదిద్దేందుకు అధికారులు సిద్ధమవుతున్న నేపథ్యంలో అటవీ శాఖ నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. సున్నపుగెడ్డ అభివృద్ధికి రూ.70 లక్షలు, పొల్ల వ్యూ పాయింట్‌కు రూ.20 లక్షలు, బెన్నరాయికి రూ.40 లక్షలు అందుబాటులో ఉన్నాయి. ఈ పర్యాటక ప్రాంతాలు పూర్తిగా రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండడంతో అటవీ శాఖ అనుమతి లేని కారణంగా ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని అటవీశాఖ అభ్యంతరాల సమస్యను పరిష్కరిస్తే రానున్న రోజుల్లో సీతంపేట ఏజెన్సీ ప్రాంతం పర్యాటక హబ్‌గా మారే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.


బెన్నరాయి జలపాతం అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు (పాత చిత్రం)

అటవీ శాఖ ఆధ్వర్యంలోనే...

ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధికి సంబంధించి అటవీశాఖ అభ్యంతరాలపై డీఎఫ్‌ఓ తవిటినాయుడు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా... ఈ 3 పర్యాటక ప్రాంతాలు పూర్తిగా రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్నాయని చెప్పారు. వీటి అభివృద్ధికి ప్రభుత్వం అటవీ శాఖకు అనుమతులు ఇచ్చిందన్నారు. మొదటిగా సున్నపుగెడ్డ జలపాతాన్ని పర్యాటకానికి అనువుగా తీర్చిదిద్దేందుకు నిధులు వచ్చినట్లు తెలిపారు. మిగిలిన వాటి పనులు ప్రాధాన్య క్రమంలో జరుగుతాయని పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో తమ శాఖ ద్వారా టూరిజం అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు.

సీతంపేట.. అందాల కోట

సీతంపేట రూరల్: ప్రకృతి అందాలకు పెట్టింది పేరు సీతంపేట మన్యం. పచ్చని కొండలు... స్వచ్ఛమైన మేఘాలు...ఇలా ప్రతి దృశ్యం మనసును హత్తుకుంటుంది. సీతంపేట ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అడుగులు పడ్డాయి. సీతంపేటలో రూ.3 కోట్లతో ఎన్‌టీఆర్ అడ్వంచర్ పార్క్... రూ.55 లక్షలతో మెట్టుగూడ జలపాతం... రూ.7 కోట్లతో జగతిపల్లి రిసార్ట్స్‌ను అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించింది. వీటిలో జగతిపల్లి రిసార్ట్స్ సకాలంలో అందుబాటులోకి రాలేదు. గిరి శిఖర ప్రాంతం కావడం... రవాణా సమస్యలు తలెత్తడంతో రిసార్ట్స్ పనులు సకాలంలో పూర్తి కాలేదు. ఇంతలో 2019 ఎన్నికలు రావడం... వైసీపీ అధికారం చేపట్టడంతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవరోధాలు ఎదురయ్యాయి. జగతిపల్లి రిసార్ట్స్ నిర్మాణ పనులకు రూ.40 లక్షలు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. ఎన్‌టీఆర్ అడ్వంచర్ పార్క్, మెట్టుగూడ జలపాతం పరిసరాలు గాలిలో ఉండిపోయాయి. సీతంపేటలోని గిరిజన మ్యూజియం పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ తరుణంలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం మరలా ఈ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తోంది.

ఇప్పుడిప్పుడే అడుగులు


గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి కొత్త ప్రభుత్వంలో అడుగులు పడుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పర్యాటక అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలం ఎస్‌కేపాడు హార్టికల్చర్ నర్సరీ అండ్ శిక్షణా కేంద్రం, తాడికొండ జలపాతం అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎస్‌కేపాడు హార్టికల్చర్‌లో యోగా కేంద్రం, బోటు షికారు, పద్మవ్యూహం పేరున వాకింగ్ ట్రాక్, రెస్టారెంట్లు, ట్రైబుల్ కల్చరల్ మ్యూజియం తదితర పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.కోటికి పైగా ఖర్చు చేశారు. తాడికొండ జలపాతం వద్ద మెట్లు, పగోడా నిర్మాణం పూర్తయ్యాయి. భవిష్యత్తులో ఈ రెండు కేంద్రాలను అభివృద్ధి చేస్తే పర్యాటకంగా బాగుంటుంది. గిరిజన యువతకు ఉపాధి దొరుకుతుంది.


ఎస్‌కేపాడులో బాణం ఆకారంలో ఉన్న మెయిన్ గేట్


తాడికొండ జలపాతంలో యువత స్నానాలు

నేను... పెద్దగడ్డను

పాచిపెంట: పెద్దగెడ్డ ప్రాజెక్టు పరిసరాలను పర్యాటక కేంద్రంగా మారుస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చేసిన ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. పచ్చటి పైరులు, ఆహ్లాదకర వాతావరణం, ప్రకృతి సహజ సిద్ధ అందాలెన్నో ఇక్కడ కనువిందు చేస్తాయి. ప్రాజెక్టు పరిసరాలలో ఎత్తయిన కొండతో పాటు పురాతన మల్లికార్జునస్వామి ఆలయం, స్పిల్‌వే, ఎర్త్ డ్యాం పరిసర ప్రాంతాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఎర్త్ డ్యాం పొడవునా వేసిన విద్యుత్ స్తంభాలు దిష్టిబొమ్మల్లా మారాయి. 2016-17లో టూరిజం అధికారులు ఇక్కడికి వచ్చి పరిశీలించారు. పార్కుతో పాటు సుందరీకరణ పనులు చేపడతామని చెప్పి... మరచిపోయారు. బోటు షికారు కోసం రూ.3 లక్షలు వెచ్చించి బోటును ఏర్పాటు చేశారు. అది మున్నాళ్ల ముచ్చటగా మారింది. కూటమి ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉంది.


పెద్దగెడ్డ ప్రాజెక్టు పరిసరాలు

తోటపల్లి... పట్టించుకోవాలి మళ్లీ

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతం పర్యాటకానికి అనువుగా ఉన్నా... అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టలేదు. ఒకవైపు నాగావళి నది, మరోవైపు చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీవేంకటేశ్వర, కోదండ రామస్వామి ఆలయాలు ఉన్నాయి. ప్రాజెక్టుకు సంబంధించి ఎడమ, కుడి ప్రధాన కాలువల మట్టికట్టలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దే అవకాశం ఉంది. 2012లో సుంకికి ఆనుకుని కుడి ప్రధాన మట్టికట్ట దిగువ భాగంలో పర్యాటక పార్కును అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని అభివృద్ధికి సుమారు రూ.41.92 లక్షలు మంజూరు చేసింది. ఆ తరువాత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లక్ష్మీషా బోటు షికారు ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్కుపై దృష్టి సారించలేదు. మొదట్లో పరిసర ప్రాంతాల నుంచి ఇక్కడికి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చేవారు. అభివృద్ధి లేకపోవడంతో ఈ ప్రాంతం వైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఏర్పడింది. జలాశయం గుర్రపు డెక్కతో నిండిపోవడంతో బోట్లు వెళ్లలేని పరిస్థితి ఎదురైంది. పార్కులో చిన్నారుల ఆట సామగ్రి మరమ్మతులకు గురయ్యాయి. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే పర్యాటకంగా మంచి గుర్తింపు వచ్చే అవకాశం ఉంది.

విశిష్ట చరిత.. వీర బొబ్బిలి ఘనత


శ్రీవేణుగోపాలస్వామి ఆలయం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో సందర్శనీయ స్థలాలు అనేకం ఉన్నాయి. ఈ ప్రాంతానికి సందర్శకుల తాకిడి పెంచే విధంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం, వైసీపీ ప్రభుత్వాలు బాసలు చేశాయి. కానీ పూర్తిస్థాయిలో దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. బొబ్బిలి విచ్చేసే సందర్శకులు రాజుల ఇలవేలుపైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని, కోట, గెస్ట్‌హౌస్‌లను సందర్శించడం పరిపాటి. బొబ్బిలి కోట, రాజావారి గెస్ట్ హౌస్‌లలో ప్రముఖ నటులు బాలకృష్ణ, వెంకటేశ్‌తో పాటు తమిళ హీరోల సినిమాల చిత్రీకరణలు జరిగాయి. బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో నాటి బొబ్బిలి యుద్ధానికి సంబంధించిన ఆయుధాలు, రాజుల బంగారు, వెండి సింహాసనాలు తదితర వాటితో మ్యూజియం ఏర్పాటు చేశారు. బొబ్బిలిలో మరో సందర్శనీయ స్థలం యుద్ధ స్మారక స్థూపం. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పదేళ్ల క్రితం ఇక్కడ సుమారు రూ.30 లక్షలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దీనిని ఆనుకొని ఉన్న భైరిసాగరం చెరువులో బోటు షికారుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత రాణిమల్లమ్మదేవి మున్సిపల్ పార్కులో గల మల్లమ్మ చెరువు (కోనేరు)లో బోటు షికారు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పర్యాటక శాఖ బుట్టదాఖలు చేసింది. బొబ్బిలి-సాలూరు పట్టణాల మధ్య రెండు రైలు బస్సులు నడిపేవారు. వీటిలో ప్రయాణించేటప్పుడు మార్గమధ్యలో పచ్చని పంట పొలాలు.... కొండలు... నదులు ఆహ్లాదాన్ని పంచేవి. కరోనా సమయం నుంచి ఈ రైలు బస్సును నిలిపివేశారు. దీనిని పునరుద్ధరించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. చారిత్రక ప్రసిద్ధిగాంచిన బొబ్బిలి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే... ఎంతో ఆకట్టుకునే అవకాశం ఉంది.


బొబ్బిలి యుద్ధస్తంభం

త్రివేణీ సంగమం... సుందర ప్రదేశం

వంగర: మడ్డువలస రిజర్వాయర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్న నాయకుల మాటలు నీటి మూటలయ్యాయి. మూడు వైపులా కొండలు... ఆ నడుమ నీరు... కొండలను తాకే నీటిశబ్దాలతో కలిగే అనుభూతిని మాటల్లో చెప్పలేం. రిజర్వాయర్‌ను ఆనుకొని ఉన్న కొండపై సాయినాథుని ఆలయం.. మరో కొండపై పాండవుల పంచలు ప్రత్యేక ఆకర్షణ. నాగావళి ... వేగావతి... సువర్ణముఖి కలిసే త్రివేణి సంగమ ప్రాంతంలో సాక్షాత్తూ బలరాముడు నిర్మించిన సంగమేశ్వర ఆలయాలను అభివృద్ధి చేస్తే పర్యాటకంగా ప్రగతి సాధించవచ్చు. మడ్డువలస రిజర్వాయర్‌ను అభివృద్ధి చేస్తామని మాజీ ముఖ్యమంత్రి జగన్, ఇతర మంత్రులు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. దీని అభివృద్ధికి ఇంజనీరింగ్ అధికారులు రూ.4 కోట్లతో అంచనాలు తయారు చేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో అంచనాలు బుట్ట దాఖలయ్యాయి.


సంగాం ఆలయం

నిధులు రావలసి ఉంది..

కాటేజీల నిర్మాణం... బోటు షికారుకు సుమారు రూ.4 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిర్మాణానికి అవసరమైన స్థలాలు గుర్తించాం. నిధులపై స్పష్టత లేదు.

-అర్జున్, ఈఈ, మడ్డువలస

తాటిపూడి... శ్రద్ధ కొరవడి!

గంట్యాడ: చుట్టూ కొండలు... మధ్యలో నీరు... అందరినీ ఆకట్టుకునే తాటిపూడి పర్యాటక కేంద్రం అభివృద్ధికి చాలా దూరంగా ఉంది. ఒకప్పుడు నిత్యం సందర్శకులతో కిటకిటలాడేది. ఇప్పుడు వెలవెలబోతోంది. ఈ ఏడాది వర్షాలు కురవడంతో రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీరు చేరడంతో కళకళాడుతోంది. 2000 సంవత్సరంలో అప్పటి కలెక్టర్ మంగపతి రావు ఇక్కడ బోటు షికారును అందుబాటులోకి తెచ్చారు. గోస్తనీ సరోవర్ విహార్ పేరిట అప్పట్లో 8 బోట్లు తీసుకొచ్చారు. వీటిని తాటిపూడి గ్రామానికి చెందిన 8 మంది నడిపేవారు. ఎకో టూరిజం ఆధ్వర్యంలో మరో రెండు పెద్ద బోటులు ఏర్పాటు చేశారు. ఈ బోట్లను గిరిజనులు నడిపేవారు. ఇక్కడ బోటు షికారు కోసం నిత్యం అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చే వారు. కార్తీక మాసంలో వేల సంఖ్యలో పర్యాటకులు వచ్చేవారు.


పర్యాటకులతో కిటకిటలాడిన తాటిపూడి (ఫైల్)

రిజర్వాయర్ ఆవల ఎకో టూరిజం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కాటేజీలు... గిరి వినాయక విగ్రహం, క్యాంటీన్ సదుపాయం కల్పించారు. మరోవైపు రిజర్వాయర్‌కు ఆవల ఉన్న గిరిజనులు వారి గ్రామాలకు బోటులో వెళ్లే వారు. తాటిపూడి అభివృద్ధికి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.కోటితో 2017 ఫిబ్రవరి మొదటి వారంలో పనులు ప్రారంభించారు. రిజర్వాయర్ వద్ద ఆర్చి, స్నాక్స్ షాపు, పగోడా, టిక్కెట్ కౌంటరు, మంచినీటి సదుపాయం, టాయిలెట్స్, బోట్లు, జట్టీలు ఏర్పాటు చేశారు. చక్కని రంగులు కూడా వేసేందుకు పనులు ప్రారంభించారు. తరువాత ఏమైందో తెలియలేదు కానీ ప్రారంభించిన కొద్ది రోజుల్లో పనులకు బ్రేకులు పడ్డాయి. వైసీపీ ప్రభుత్వం కూడా తాటిపూడి పర్యాటక కేంద్రంపై దృష్టి పెట్టలేదు. 2017 నవంబరులో కృష్ణానదిలో జరిగిన బోటు ప్రమాదంతో ఇక్కడ బోటు షికారు నిలిపివేశారు. అప్పటి నుంచి సందర్శకులు కూడా ఈ ప్రాంతానికి పెద్దగా రావడం లేదు. రిజర్వాయర్‌కు ఆవల గిరివినాయక కొండ వద్ద ఎకో టూరిజం ఆధ్వర్యంలో అభివృద్ధి చేయడానికి ఎస్‌డీపీ నుంచి సుమారు రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఆ పనులు కూడా నిలిచిపోయాయి. బొడ్డవరం నుంచి రహదారి సదుపాయం కల్పిస్తే సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోడ్డు నిర్మాణం కూడా జరగలేదు. ఇకనైనా పాలకులు, అధికారులు ఇక్కడ పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఎంపీ కలిశెట్టికి టీడీపీ శాశ్వత సభ్యత్వం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీసుకున్నారు. గురువారం నాడు విశాఖపట్టణంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ సభ్యత్వాన్ని స్వీకరించారు. టీడీపీ సంస్థాగత ప్రక్రియలో భాగంగా సాధారణ, క్రియాశీలక సభ్యత్వాలు ఉండేవి. ఈ పర్యాయం శాశ్వత సభ్యత్వాన్ని కూడా ఏర్పాటు చేశారు.

హింధూ ధర్మాన్ని పరిరక్షించాలి

రాజాం రూరల్: హింధూ ధర్మాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని జనసేన ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పొగిరి సురేష్ బాబు స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఇతర మతాలకు, వారి ఆచార, వ్యవహారాలకు భంగం కలగకుండా, మనోభావాలు దెబ్బతినకుండా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గురువారం రాజాంలో అంబేద్కర్ కూడలిలో నిరసన దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో పునర్జన్మ: ఎస్పీ

విజయనగరం క్రైం: గుండెపోటుకు గురైన వారికి తక్షణమే సీపీఆర్ చేస్తే పునర్జన్మ అందించవచ్చునని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవంలో భాగంగా మెడికల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా సమాజానికి ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు సిబ్బందిని సీపీఆర్ నిర్వహించడంలో సుశిక్షితులను చేసేందుకు తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం చేపట్టామన్నారు. ఆసుపత్రి ఎంపీ డాక్టరు తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ ఇతరులను రక్షించేందుకు పోలీసు సిబ్బందికి తప్పనిసరిగా సీపీఆర్ విధానంపై అవగాహన ఉండాలన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

జిల్లాలో భారీ వర్షం


విజయనగరం సమీపంలో కురుస్తున్న వాన

విజయనగరం(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ ఎండ ఉన్నా 11 గంటల తరువాత వాతావరణం ఒక్కసారిగా మారింది. ఆకాశం మేఘావృతమై వర్షం మొదలైంది. నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, చీపురుపల్లి, ఎస్.కోటతో పాటు పలు ప్రాంతాల్లో వాన పడింది. విజయనగరంలో కురిసిన వర్షానికి శివారు కాలనీలు, మార్కెట్ జలమయమయ్యాయి.

సబ్‌జైలును తనిఖీ చేసిన న్యాయాధికారి

బొబ్బిలి: స్థానిక సబ్‌జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్, జిల్లా ప్రిన్సిపల్ న్యాయాధికారి బి.కళ్యాణచక్రవర్తి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడారు. వసతి, భోజన సౌకర్యాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జైలులో ఎంతమంది రిమాండ్ ఖైదీలు ఉన్నారు? ఎన్నాళ్ల నుంచి ఉన్నారు? ఏ నేరారోపణపై వచ్చారు? తదితర విషయాలను ఆరా తీశారు. ఖైదీల సంక్షేమం విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ఆదేశించారు. ఆయన వెంట సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎస్.అరుణశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు, న్యాయవాది సీహెచ్‌ఎల్‌వి ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య సాయం అందించాం

శృంగవరపుకోట: అస్వస్థతకు గురైన శృంగవరపుకోట సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహ విద్యార్థులకు సకాలంలో వైద్య సాయం అందించామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'వసతి గృహ విద్యార్థులకు అస్వస్థత' అనే వార్తకు ఆయన స్పందించారు. వసతి గృహం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. విరేచనాలతో బాధ పడుతున్న విద్యార్థులను ఆరోగ్య కార్యకర్త ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించారని తెలిపారు. చికిత్స పొందుతున్న విద్యార్థులంతా పూర్తిగా కోలుకున్నారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వేణుగోపాల స్వామి ఆలయ రికార్డులు పరిశీలన

పూసపాటిరేగ: కోనాడ గ్రామంలో గల వేణుగోపాల స్వామి ఆలయ భూములపై 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంపై ఈవో జగదీశ్వరి, తహసీల్దారు గోవింద్ తదితరులు గురువారం స్పందించారు. ఆలయ రికార్డులను పరిశీలించారు. దేవదాయ శాఖలో గల భూములకు సంబంధించిన వివరాలు మాత్రమే వీరు ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. త్వరలోనే ఈ భూములలో పూర్తిస్థాయి సర్వే నిర్వహించేందుకు రెవెన్యూ, అధికారులు, దేవదాయ శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ భూములకు సంబంధించి వేలం నిర్వహిస్తే గానీ ఆక్రమణలు, నిజానిజాలు బయటకు వచ్చే అవకాశాలు లేవని అధికారులు నిర్ధారణకు వచ్చారు. శిస్తు బకాయిల వసూలుపై కూడా దేవదాయ శాఖ అధికారులు దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది.

విజయనగరం ఆర్డీవోగా దాట్ల కీర్తి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఆర్డీవోగా దాట్ల కీర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు విశాఖపట్టణం వీఎంఆర్‌డీఏలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న దాట్ల కీర్తిని విజయనగరం ఆర్డీవోగా నియమించారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న సూర్యకళను జీఏడీలో రిపోర్టుచెయ్యాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

విజయనగరం టౌన్: ఉమ్మడి జిల్లా పరిధిలో స్కూల్ గేమ్స్ అండర్- 14, అండర్- 17 విభాగాల్లో వివిధ క్రీడాంశాల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు గురువారం తెలిపారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 1 వరకు 11 క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించనున్నామని, క్రీడాకారులు ఆయా తేదీల్లో హాజరుకావాలన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు పాఠశాలల నుంచి అనుమతి పత్రాలు తీసుకోవాలన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

గజపతినగరం: సీపీఎం చేపట్టనున్న పదో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హాల్లో మహాసభలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 9, 10 తేదీల్లో స్థానిక లక్ష్మీనారాయణ ఫంక్షన్‌హాల్లో జిల్లా మహాసభలను రెండు రోజుల పాటు నిర్వహించనున్నామ న్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

మెంటాడ: మండలంలోని జక్కువలో గురువారం బెల్ట్‌షాప్‌పై ఆండ్ర పోలీసులు దాడిచేసి 38 మ ద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మద్యం సీసాలు ప లు షాపులు, ఇళ్లల్లో ఉంచి అమ్మకాలు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సీతారాం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు పరామర్శ

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో అతిసారంతో చికిత్స పొందుతున్న సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహ బాలికలను గురువారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రమేష్, అను, రత్న, చరణ్ తదితరులు పరామర్శించారు. వసతి గృహ పరిసరాలు సరిగాలేవని, ఆహారం, నీరు కలుషితం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు.

పారదర్శకంగా బదిలీలు చేపడితే విమర్శలా?

బొబ్బిలి: విజయనగరం జిల్లాలో విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీరు మువ్వల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఉద్యోగుల బదిలీలు చాలా పారదర్శకంగా జరిగాయని తెలుగునాడు విద్యుత్‌కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.తేజేశ్వరరావు, కోటిపల్లి జయరాజు అన్నారు. గురువారం వారు బొబ్బిలిలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. కొంతమంది తమ వ్యక్తిగత స్వార్థం కోసం ఎస్‌ఈ పనితీరుపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది చాలా అభ్యంతరకరమన్నారు.

శతశాతం ఇళ్ల నిర్మాణాలే లక్ష్యం

విజయనగరం రింగురోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'మన ఇళ్లు, మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా శతశాతం ఇళ్ల నిర్మాణాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 2025 నాటికి ఆప్షన్-1, 2 విధానంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తికావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంతఈ శ్రీనివాసరావు, టీపీఆర్‌వో సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రునికి ఘనంగా అభిషేకం

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం శ్రీరామచంద్రస్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టాభిషేకం చేశారు. స్వామి వారిని విశేషంగా పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమాలను ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించగా, ఆలయ అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, పవన్‌కుమార్ తదితరులు నిర్వహించారు.

వ్యవసాయశాఖ కమిషనర్‌ను కలిసిన బంగార్రాజు

డెంకాడ(భోగాపురం): రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావ్‌ను గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఢిల్లీరావ్ బంగార్రాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతు సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేద్దామన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

రాజాం రూరల్: మత్తుపదార్థాలు వాడకాన్ని యువత ఫ్యాషన్‌గా తీసుకుని, ఆపై వాటికి బానిసలవు తున్నారని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. మత్తుపదార్థాల వినియోగం-అనర్థాలపై పట్టణం లోని ఓ ప్రయివేటు కళాశాలలో ఎస్.ఐ. నరశింహమూ ర్తితో కలిసి గురువారం అవగాహన సదస్సు నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. డ్రంక్, అండ్ డ్రైవ్, ట్రాఫిక్ రూల్స్, ఆటోడ్రైవర్లు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ● **సంతకవిటి:** స్థానిక మండల కేంద్రం లో గురువారం పోలీసులు డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలు, క్రిమినల్ చట్టాలు, ఈవ్ టీజింగ్‌పై కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై గోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

కొత్తవలస: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కొత్తవలస సీఐ విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తవలసలోని భారత్ డిఫెన్స్ అకాడమీలో విద్యార్థుల చేత ముందుగా సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు.

జేఎన్‌టీయూలో రక్తదాన శిబిరం

విజయనగరం రూరల్: నగర శివారులోని జేఎన్‌టీయూలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1,2 ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి విజయనగరం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 110 మంది విద్యార్థులు హాజరవ్వగా, వారిలో 82 మంది విద్యార్థుల నుంచి 82 యూనిట్ల రక్తం తీసుకున్నారు. యూనివర్సిటీ వైఎస్ ఛాన్సలర్ రాజ్యలక్ష్మి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఇంజినీరింగు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

బొబ్బిలి రూరల్: మండలంలోని కొండదేవపల్లి గ్రామంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అధ్యక్షతన జరిగింది. ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని, ప్రజల అభివృద్ధే ధ్యేయంగా నడుస్తున్న ప్రభుత్వం అని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లను బేబీనాయన సత్కరించారు.



రామభద్రపురం: మాట్లాడుతున్నబేబీనాయన



ఎస్‌కోటరూరల్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోళ్ల

● **రామభద్రపురం:** రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందించడానికి కృషి చేస్తుందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. మండల పరిధిలోని నాయుడువలస గ్రామంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ● **శృంగవరపుకోట రూరల్:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల అభివృది..సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని ఇచ్చిన హామీలకు కట్టుబడి వున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో నిర్వహించిన మంచిప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎల్‌జీటీ సినీమాస్ ప్రారంభం



రిబ్బన్‌కట్ చేసి ప్రారంభిస్తున్న నటి పాయల్

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 26: ప్రముఖ సినీ హీరోయిన్ పాయల్‌రాజ్‌పుత్ (ఆర్‌ఎక్స్ 100 ఫేమ్) నగరంలో గురువారం సందడి చేశారు. రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ఫోర్ట్‌సిటీ సెంట్రల్ మాల్లో ఎల్‌జీటీ సినిమాస్‌ను ఆమె ప్రారంభించారు. ఈ మాల్లో నాలుగు స్క్రీన్‌లు ఉన్నాయి. హీరోయిన్ మాట్లాడుతూ విజయనగరం రావడం ఇది రెండోసారని, ఇక్కడి ప్రేక్షకులు తనను ఎంతగానో ఆదరిస్తున్నారని చెప్పారు. సినిమాను పైరసీ చేయొద్దని, ప్రతి ఒక్కరూ వెండితెరపై మాత్రమే చూడాలని కోరారు. ఆమె అభిమానులు పెద్దఎత్తున ఫోర్టుసిటీ ప్రాంగణానికి చేరుకున్నారు. వారందరికీ ఆమె అభివాదం చేశారు. అంతకుముందు ఎల్‌జీటి స్క్రీన్స్ ఎండీ ఎల్‌జీ త్రినాథ్‌రావు మాట్లాడుతూ ప్రేక్షకులు ఆహ్లాదకరంగా సినిమా చూసేందుకు అత్యాధునిక సౌండ్‌సిస్టం, 4కె నాణ్యత కలిగిన స్క్రీన్‌లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎల్‌జీటీ సినిమాస్ డైరెక్టర్లు నవ్య, సాయివందన, సుహాస్ థియేటర్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైలులో న్యాయ అవగాహన సదస్సు

విజయనగరం టౌన్: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కల్యాణి ఆధ్వర్యంలో విజయనగరం సబ్ జైలులో గురువారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సంస్థ కార్యదర్శి విజయ కల్యాణి జైల్లో ఉన్న ముద్దాయిలకు అరెస్ట్, వారి హక్కులపై వివరించారు. ఈ సందర్భంగా జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను పరిశీలించారు.

అన్ని పంటలకు ఉచిత బీమా అమలు చేయాలి

కలెక్టరేట్: రైతులు సాగు చేస్తున్న పంటలకు ఉచిత బీమా అమలు చేయాలని ఏపీ రైతు సంఘనాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘ రాంబాబు నాయకులు మాట్లాడుతూ అన్నదాత పెట్టుబడి సాయం రూ.20 వేలు అందజేయాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్ల ఏర్పాటుకు ఇచ్చిన జీవోను రద్దు చేయలన్నారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ కౌలుదారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. భూముల రీసర్వేలో ఉన్న లోపాలు సరి చేయాలన్నారు. రైతు సంఘ నాయకులు పైడిపునాయుడు, బంగారయ్య తదితరుల ఉన్నారు.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి

రింగురోడ్డు: దివ్యాంగులు, కుష్టువ్యాధిగ్రస్థులు సామాజికంగా ఆర్థికంగా అన్నిరంగాల్లో రాణించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ జీవీబీ జగదీష్ అన్నారు. గురువారం లెప్రసీ మిసన్ 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా హీల్ ప్రోజక్టు ఆధ్వర్యంలో లెప్రసీ వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులతో చాంపియన్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏడీ జగదీష్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. హీల్ ప్రోజక్టుమేనేజర్ కిస్మత్ నందా మాట్లాడుతూ కృష్టు వ్యాధిగ్రస్థులకు తోడ్పాటును అందించాలనే ఉద్దేశంతోనే లెప్రసీ మిషన్ స్థాపించారన్నారు. ప్రాజక్టు కో-ఆర్డి నేటర్ తాలాడ దీప్తి, జిల్లా డీఎంఎన్‌వో అధికారిని డాక్టర్ అర్చన, హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు అచ్చిరెడ్డి, హెల్పింగ్ హ్యాండ్స్ సంఘ అధ్యక్షుడు కొంపల్లి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీష్

ఇబ్బంది కలిగించకుండా ఇసుక తరలించండి: జేసీ

వంగర: కొండచాకరాపల్లిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఇసుక ర్యాంపు నుంచి ఇసుక తరలించే గుత్తేదారు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జేసీ సేతుమాదవ్ సుచించారు. గురువారం గ్రామానికి చేరుకుని ఇసుకను పరిశీలించారు. ఇసుక తరలించే ప్రదేశంలో సిల్టు పేరుకుపోవటంతో దాన్ని తొలగించాలని గుత్తేదారుకు ఆదేశించారు. స్థానికులు ఇసుకను ఆన్‌లైన్‌లో డీడీ తీసి కొనుగోలు చేయాలి తప్ప గుత్తేదారునుంచి నేరుగా కొనుగోలు చేయవద్దని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇసుక తవ్వకాలు జరిగేలా చూడాలని తహసీల్దార్‌కు జేసీ సూచించారు. పలువురు అధికారులున్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుదాం: బేబీనాయన

బొబ్బిలి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలోభాగంగా బొబ్బిలి పట్టణాన్ని పరిశుభ్రత విషయంలో ఆదర్శంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే బేబీనాయన పిలుపునిచ్చారు. స్థానిక యుద్ధస్మారకస్థూపం దగ్గర గురువారం నిర్వహించిన స్వచ్ఛతాహి కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వయంగా చీపురుతో శుభ్రపరిచారు. గోడలకు వెల్లవేశారు. విజయవాడలో వరద ముంపుప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు వెళ్లిన 20 మంది మున్సిపల్ కార్మికులకు బేబీనాయన తన సొంత సొమ్ముతో దుస్తులను వితరణగా అందజేశారు.

గ్రీన్ అంబాసిడర్ల జీతాలు వెంటనే చెల్లించాలి

బాడంగి: గ్రామాన్ని శుభ్రం చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు ఎ.సురేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీతాలు వెంటనే చెల్లించకపోతే శుక్రవారం జరగనున్న జనరల్‌బాడీ సమావేశాన్ని అడ్డుకుంటామన్నారు.

పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్లో విచారణ

● ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్న డిప్యూటీ డీఈవో

బొబ్బిలి: స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్లో డిప్యూటీ డీఈఓ కె.మోహనరావు గురువారం విచారణ జరిపారు. ఈ పాఠశాలలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పోలీసులకు సమాచారం రావడంతో బుధవారం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సతీష్‌కుమార్‌లు పాఠశాలకు వెళ్లి హెచ్చరికలతో కూడిన అవగాహన కార్యక్రమం నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి స్పందించారు. డిప్యూటీ డీఈవోను పాఠశాలకు పంపించి సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. దీంతో గురువారం డిప్యూటీ డీఈవో మోహనరావు, ఇద్దరు ఎంఈవోలు చల్లా లక్ష్మణరావు, గొట్టాపు వాసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలలో ఎటువంటి అవాంఛనీయ, అనైతిక కార్యకలాపాలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చినా చట్టపరంగా కఠినచర్యలు తప్పవని, బాధ్యులైన వారిని పూర్తిగా డిస్మిస్ చేస్తామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి విడివిడిగా స్టేట్‌మెంట్లు నమోదు చేశారు. హైస్కూల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని వారంతా లిఖిత పూర్వకంగా అధికారులకు తెలియజేశారు. పోక్సో చట్టం అమల్లో ఉన్న దృష్ట్యా అందరూ అప్రమత్తంగా ఉండాలని, నైతిక విలువలను పరిరక్షించాలని, పాఠశాల ఔన్నత్యాన్ని కాపాడాలని డిప్యూటీ డీఈవో సూచించారు.

డీఈవోకు నివేదిక ఇస్తాం

పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్లో ఎవరి నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాలేదు. పోలీసులకు అందిన సమాచారం మేరకు పాఠశాలలో ఏమి జరిగిందన్న దానిపై ఆరా తీశాం. పాఠశాలలో ఏమీ జరగలేదని ఉపాధ్యాయులు, విద్యార్థులు విడివిడిగా రాసిచ్చారు. డీఈవో ఆదేశాల మేరకు పాఠశాలలో పనిచేస్తున్న వారందరికీ చట్టనిబంధనలు, క్రమశిక్షణకు సంబంధించిన అంశాలను కూలంకుషంగా వివరించాం. పాఠశాలలో ప్రస్తుత తాజా పరిస్థితిపై జరిపిన విచారణాంశాలను సమగ్రంగా డీఈవోకు నివేదిక అందజేస్తాం.

- కె.మోహనరావు, డిప్యూటీ డీఈవో

పెనుబర్తిలో డయేరియా

● ఒకరి మృతి.. ఆలస్యంగా వెలుగులోకి..

గుర్ల: మండలంలోని పెనుబర్తి గ్రామంలో గత మూడు రోజులుగా డయేరియా విజృంభించింది. బుధవారం అదే గ్రామానికి చెందిన రొంగళి శేషగిరిరావు(52) మృతి చెందారు. అతని ఇద్దరు కుమార్తెలు హైమావతి, లక్ష్మికి విరోచనాలు కావడంతో వీరంతా విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో హైమావతి పరిస్థితి విషమంగా ఉంది. జి.శ్రీరాములు, అప్పన్న, రామ్మూర్తితోపాటు మరో ఇద్దరకి తీవ్రంగా విరోచనాలు కావడంతో గరివిడిలోని ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. శేషగిరిరావు గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడని అయితే అదే రోజు ఎక్కువగా విరోచనాలు కావడంతో విజయనగరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించామని, అక్కడే చనిపోయారని కుటుంబీకులు తెలిపారు. ఇదే విషయాన్ని వైద్యులు కూడా ధ్రువీకరించారు. డయేరియా విజృభిస్తుండడంతో వైద్య సిబ్బంది గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. పారిశుధ్య పనులు చేపట్టారు. వైద్య శిబిరం నిర్వహించారు. అంటురోగాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ ఆదిలక్ష్మి అధికారులకు పిలుపునిచ్చారు. ● ఇదే విషయమై గ్రామ కార్యదర్శి శేఖర్‌ను వివరణ కోరగా చాలా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. గ్రామంలో ఇలాంటివి జరగడం గొప్పవిషయం కాదని, ఇలాంటివి జరుగుతుంటాయని, ఇలాంటి వాటిని పెద్ద విషయాలుగా చూడాల్సిన పనిలేదన్నారు. ఎవరికీ ఎటువంటి విరోచనాలుగానీ, జ్వరాలుగానీ రాలేదన్నారు. గ్రామంలో జరుగుతున్న పరిస్థితులు, కార్యదర్శి ఇచ్చిన సమాధానాలపై ఈవోపీఆర్‌డీ గాయత్రిని వివరణ కోరగా గ్రామంలో పరిస్థితి కొంతమేర బాగోలేదని, వాటిని చక్కదిద్దే పనిలో ఉన్నామన్నారు. వైద్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి పరిస్థితిని పరిశీలిస్తున్నారన్నారు. గ్రామంలో డయేరియా వ్యాధిగ్రస్థుల ఆరోగ్యంపై మెడికల్ ఆఫీసర్ సమీక్షిస్తున్నారు. తహసీల్దార్, గ్రామ సర్పంచ్ పరమేశ్వరరావు, టీడీపీ నాయకులు మండల అప్పలనాయుడు, గుషిడి సూర్యారావు కూడా ఉన్నారు.



పెనుబర్తిలో వైద్య శిబిరం దృశ్యం


డ్రగ్స్ నియంత్రణపై ఎస్ఎఫ్ఐ ఫ్లాష్‌మాబ్

విజయనగరం దాసన్నపేట: నగరంలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలిద్దాం.. భవిష్యత్‌ని కాపాడుకుందాం అనే కార్యక్రమంపై గురువారం పలు చోట్ల ఫ్లాష్‌మాబ్స్ ప్రదర్శన నిర్వహించారు. మత్తుపదార్థాలు నిర్మూలించాలన్న అంశంపై అవగాహన కోసం ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో తోటపాలెం, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఫ్లాష్‌మాబ్స్ నిర్వహించారు. విద్యార్థి బృందాలు పలు సినిమా పాటలకు నృత్యాలు ప్రదర్శించారు. ఈ నెల 28 , 29 తేదీల్లో జరగనున్న భగత్‌సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్ గురజాడ కళాక్షేత్రంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సమీరా, రమేష్‌రాజు తెలిపారు.

జియో రామకృష్ణకు ఇంటర్నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు

శృంగవరపుకోట: శృంగవరపుకోట గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్(జియో) వ్యవస్థాపకుడు బి.రామకృష్ణకు గురువారం విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఐదో వార్షికోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందించింది. విశాఖపట్టణం దస్పల్లా సభాప్రాంగణంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణ మూర్తి తదితరులు ధ్రువపత్రాన్ని అందించారు.

హమాలీల నిరసన



గంతలు కట్టుకుని నినాదాలు చేస్తున్న హమాలీలు

బొబ్బిలి: సివిల్ సప్లయీస్ హమాలీలకు ఇవ్వాల్సిన పాతబకాయిలతో పాటు ఇతర చెల్లంపులకు సంబంధించి ప్రత్యేక జీవో జారీ చేయాలని డిమాండ్ చేస్తూ హమాలీల సంఘం నిరసన తెలియజేసింది. ఏఐటీయూసీకి అనుబంధంగా గల ఏపీ సివిల్ సప్లయీస్ హమాలీ సంఘం నాయకులు పొందూరు గోపి, మెండి నరసింహులు ఆధ్వర్యంలో గురువారం ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాముల సముదాయంలో కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



వెంకటరమణ (ఫైల్)

రేగిడి, సెప్టెంబరు 25: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిరేగిడి ఏఎస్‌ఐ గౌరినాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలికావలస గ్రామనికి చెందిన కొడిశ వెంకటరమణ(42) బొలెరో వాహనం నడుపుతూ, సిమెంట్ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ఇంటిమీద, నడుపుతున్న బొలెరో వాహనంపైన ఇతర అప్పులు ఉన్నాయి. ఆదాయంలేకపోవటం, వాడిన అప్పులకు ఈఎంఐలు కట్టలేకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. మనస్థాపం చెంది ఊరు బుధవారం రాత్రి ఊరుబయట పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న వెంకటరమణను గుర్తించిన గ్రామస్థులు, కుటుంబీకులు 108లో ముందుగా రాజాం కేర్ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం శ్రీకాకుళం ప్రైవేటు అసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడుకి భార్య చంద్రకళ, పిల్లలు శరణ్‌చైతన్య, విష్ణువర్ధన్ ఉన్నారు. శవపంచనామ, పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.

ఎలక్ట్రికల్ బైక్‌లో మంటలు

రేగిడి: ఎలక్ట్రికల్ బైక్‌కు మంటలు చెలరేగిన ఘ టన మండలంలో చోటు చే సుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందన బెవర తులసికి చెందిన ఎలక్ట్రికల్‌బైక్‌ను గురువారం ఉదయం ఆమె భర్త ఆనందరావు సొంత పనిమీద బైటకు తీసుకువెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామం దగ్గర్లో బైక్‌లో నుంచి పొగలు వచ్చాయి. ప్రమాదం గమనించి బైక్‌కు త్వరగా ఇంటికి తీసుకువచ్చి స్టాండ్‌వేయగా, ఒక్కసారిగా బ్యాటరీలో నుంచి మంటలు వచ్చాయి. వెంటనే మంటలను అదుపుచేసి, పాలకొండ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ అధికారి సర్వేశ్వరరావు, సిబ్బంది చేరుకుని ప్రమాద నష్టం అంచనా వేశారు. బైక్ బ్యాటరీ దగ్ధం కావటంతో కొన్ని భాగాలు పాడయ్యాయని, నష్టం రూ. 60వేలు ఉంటుందని ఆయన అంచనా వేశారు.



అగ్నిప్రమాదానికి గురైన బైక్, కాలిపోయిన బ్యాటరీ

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గజపతినగరం: మండలంలోని సీతారామపురంవద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై. కె. లక్ష్మణరావు గురువారం తెలిపారు. స్థానిక చంపావతి నదినుంచి తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడి చేయగా మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టుబడినట్లు తెలిపారు. మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణా సంస్థ, విజయనగరం జిల్లా

షార్ట్ టెండర్ ప్రకటన

విజయనగరం జిల్లా ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరమునకు 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పరీక్షలను నిర్వహించుటకు, తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో ప్రశ్నాపత్రములను సబ్జెక్టు వారీగా, తరగతుల వారీగా ముద్రించి, పాఠశాలల వారీగా ప్యాకింగ్ చేసి, ప్యాకింగ్ చేసిన బండిళ్లను జిల్లాలోని అన్ని మండల కేంద్రాలకు సరఫరా చేయుటకు ట్రాన్స్పోర్ట్ మరియు GSTతో పేజీ రేటుతో సహా టెండరు దాఖలు చేయుటకు ప్రకటన జారీ చేయడమైనది. OMR Sheets ముద్రణ మరియు OMR Sheets స్కానింగ్ చేయుటకు కూడా టెండర్‌లను ఆహ్వానించడమైనది. టెండర్లలో పాల్గొనదలిచిన వారు దరఖాస్తు ఒక్కింటికి రూ.500/- మరియు EMD రూ.5000/- దరావతును D.D.రూపంలో వేరువేరుగా కార్యదర్శి, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణా సంస్థ, విజయనగరం పేరున తే.01.10.2024ది సాయంత్రం 5.00 గంటల లోపు డిపాజిట్ చేసుకుని, టెండరు ఫారంలను పొందవలయును. మరిన్ని వివరములకు కార్యదర్శి, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణా సంస్థ, విజయనగరం వారిని సంప్రదించగలరు.

సం/- **చైర్మన్,** జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణా సంస్థ, విజయనగరం జిల్లా.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షా, విజయనగరం
పత్రికా ప్రకటన

ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్షా సొసైటీ (పాఠశాల విద్యాశాఖ) ద్వారా విజయనగరం జిల్లాలో నిర్వహించబడుతున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన (కాంట్రాక్ట్) మరియు బోధనేతర సిబ్బందిని పొరుగుసేవల (ఔట్‌సోర్సింగ్) ప్రాతిపదికన 2024-25 విద్యాసంవత్సరం (ఒక సంవత్సరం) కాలానికి భర్తీ చేయుటకు అర్హులైన మరియు ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరడమైనది. **ఖాళీల వివరాలు:** ప్రిన్సిపాల్-0, పీజీటీ-15, సీఆర్టీ-08, పీఈటీ-0, పార్ట్‌టైం టీచర్స్-15, వార్డెన్-4, అకౌంటెంట్-06, మొత్తం-48, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులను **apkgbv.apcfss.in** వెబ్సైట్ ద్వారా **రూ.250/- దరఖాస్తు రుసుము చెల్లించి తేది: 26-09-2024 నుంచి ది.10-10-2024, సమయం: 11-59pm.** నిమిషముల వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఆఫ్లైన్, ఫిజికల్ దరఖాస్తులు స్వీకరించబడవు. వయోపరిమితి: ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18-42 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, EWS 5 సంవత్సరాలు, మాజీ సైనిక ఉద్యోగినులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు వయోపరిమితి సడలింపు కలదు. విజయనగరం జిల్లాలో సబ్జెక్టుల వారీగా రోస్టర్ వారీగా పోస్టుల వివరాలు, గౌరవ వేతనము మరియు విద్యార్హత వివరాలను **apkgbv.apcfss.in** వెబ్సైట్ నందు ఉంచబడిన పూర్తి నోటిఫికేషన్ ద్వారా పొందవచ్చును.

తేది:26-09-2024
విజయనగరం

జిల్లా విద్యాశాఖాధికారి & ఎక్స్ అఫీషియో
డి.పి.సి & ఎ.పి.సి., సమగ్రశిక్షా, విజయనగరం